# ఆత్మశాంతి

"ఏమే! ఆ రెండో ధోవతీ, ఉత్తరీయం కూడా ఉతికించావా!" వెంకట్రామయ్య ప్రశ్న విని నవ్వుకుంది వరలక్ష్మి.

భర్త సంబరాన్ని రెండ్రోజులుగా గమనిస్తూనే ఉందామె. అప్పటివరకూ నీరసంగా ఉన్న మనిషికి ఊడుపుగల్లు ప్రయాణం అనేసరికి ఎంత హుషారొచ్చిందో!

అవును మరి! ఆయనకు ఆ వూరితో వున్న అనుబంధం అలాంటిది. వరలక్ష్మి కాపురానికి వచ్చేనాటికి ఆయనకి యిరవై ఏళ్ళు. అంతకుముందు ఎప్పటినుంచో ఆ వూర్లో వుంటున్నారు వాళ్ళు.

ఆయన బాల్యమూ.. యవ్వనమూ.. వృద్ధాప్యమూ.. జీవితంలోని ప్రతీ అనుభవమూ అక్కడే గడిచింది. ఎనభైఏళ్ళు వచ్చేవరకూ అదే వూరు. అదే యిల్లు.

పిల్లలందరూ హైదరాబాద్‌లో ఉద్యోగాలు సంపాదించుకుని వచ్చేసినా వాళ్ళు మాత్రం ఆ వూరు వదిలిపెట్టలేదు. వంట్లో ఓపిక వున్నంతవరకూ నెట్టుకొచ్చారు. నాలుగేళ్ళ క్రితం... యింక లాభం లేదనుకున్నాక, అప్పుడు ఇల్లు అమ్మేశారు. వచ్చిన డబ్బులు పిల్లలందరికీ సమానంగా పంచి, పెద్దకొడుకు దగ్గరికి వచ్చేశారు.

ఇక్కడ బాగానే వుంది. కోడలు అన్నం వండిపెడుతుంది. హాల్లో టి.వి. మ్రోగుతూ వుంటుంది. మనవళ్ళూ.. మునిమనవళ్ళూ సందడి చేస్తూంటారు.

కానీ యివేవీ ఆయనకి పూర్తి సంతృప్తినివ్వలేదు. ఘడియకీ, క్షణానికీ "ఏవండోయ్ వెంకట్రామయ్యగారూ! ఏం చేస్తున్నా" రంటూ వీధిలోనుంచి వినబడే పలకరింపులూ.. కాలు బయటపెట్టడం ఆలస్యం "నమస్కారమండీ" అంటూ ఎదురొచ్చే పరిచయస్థులూ, రచ్చబండ దాకా నడిచి నడుం ఆనిస్తే.. మందగమనాలతో చుట్టుముట్టే వృద్ధనేస్తాలూ.. ఇక్కడ అలాంటివేమీ లేవు.

ఇక్కడ వెంకట్రామయ్య అనేవాడు ఎవరికి తెలుసు! ఈ మూల గదిలో మంచం మీద పడుకున్న ముసలాయన గురించి ప్రక్కింటివాళ్ళకైనా సరీగా తెలీదు.

అలాగే మూడేళ్ళు గడిపాడు. పుట్టిపెరిగిన పల్లెటూరిమీద ఎంత మమకారం వున్నా.. నేనేగా ఆ వూరితో సంబంధం తెంపుకుని వచ్చేశాను! అనుకుంటూ సమాధానపడ్డాడు.

కానీ గతసంవత్సరం ఆరోగ్యం మరీ దెబ్బతింది. ఇంకెన్నాళ్ళో బ్రతకనని ఆయనకి అర్థమయింది. దానితోపాటూ ఒక్కసారి ఊరు చూసి రావాలన్న కోరిక ఉధృతమయింది.

వరలక్ష్మికి తెలుసు. కొడుకులకీ, మనవళ్ళకీ కూడా తెలుసు. కానీ ఎనభైనాలుగేళ్ళ ముసలాయన్ని యిప్పుడక్కడికి ఏమని తీసుకువెళ్తారు!

"చార్జీలూ, డబ్బులూ అని కాదమ్మా. అసలు ఆయన ప్రయాణమన్నా చేసే స్థితిలో లేడు కదా!" అన్నాడు పెద్ద కొడుకు రాఘవ. "తీరా అక్కడిదాకా వెళ్ళినా హైరానా మిగుల్తుంది తప్ప ఈయన వూహించుకున్నంత ఏముంటుందని! ఆ పల్లెటూర్లో ఎవరింటికని వెళ్తాం! ఏం చేస్తాం!"

అతను చెప్పిందీ నిజమే. అంత పనికట్టుకుని ఆయన్ని అక్కడికి తీసుకెళ్ళే అవసరం కానీ.. అవకాశం కానీ ఎవరికీ లేవు. ఆయన కలవరిస్తున్నాడు. నిజమే. కానీ ఆచరణకి అది సాధ్యమయ్యే పని కాదు.

అందుకే భర్త చిన్న పిల్లాడిలా గొడవ పెడుతుంటే వరలక్ష్మి ఓపికగా నచ్చచెపుతూ వచ్చింది. "..రామనాధం గారూ, కృష్ణమూర్తిగారూ కూడా యిప్పుడక్కడ లేరట. శ్రీమన్నారాయణగారూ పోయిన సంవత్సరం పోయారట. ఊరు కూడా యిప్పుడు చాలా మారిపోయిందట..." ఈ ధోరణిలో ఆవిడ చెప్పినంతసేపూ చెప్పేది. మాట్లాడకుండా వినేవాడు వెంకట్రామయ్య. అంతా అయ్యాక, గుండెలమీద తడుముకుంటూ.. పైకప్పు మీద చూపు నిలిపి.. "ఏమయినా ఒక్కసారి చూసి రావాలని వుందే!" అనేవాడు.

వరలక్ష్మి తలమీద తట్టుకుని, అసహాయంగా నిట్టూర్చేది. కానీ వారం క్రితం ఒక అద్భుతం జరిగింది. దేవుడు ఆయన బాధకి కరిగాడో.. ఆమె ప్రార్థన విన్నాడో కానీ., ఆయన తమ్ముడి కొడుకు వచ్చాడు శుభలేఖలు పట్టుకుని.

" పెదనాన్నా! మావాడి పెళ్ళి కుదిరింది. అమ్మాయిది ఈడుపుగల్లు. పధ్నాలుగో తారీఖున ముహూర్తం. వాన్ మాట్లాడాను. అందరం పదమూడు రాత్రికి బయల్దేరి వెళ్ళాలి." అని చెప్పి వెళ్ళాడు.

అదిగో ఆమాటలు విన్నప్పటినుంచీ వెంకట్రామయ్య సంతోషం చెప్పతరం కాదు. పెట్లోనుంచి తన పాత సంచీ బయటకి తీయించాడు. బట్టలన్నీ ఉతికించుకుని అందులో సర్దించుకున్నాడు.

ఇంట్లో యింకా ఎవరెవరు బయల్దేరుతున్నారో వరలక్ష్మికి అర్థం కాలేదు. "కొడుకు, కోడలు అయితే తప్పకుండా వెళ్తారు. తనని చూసుకునేందుకు ఒక మనవడినీ, మనవరాలినీ అట్టేపెట్టి వెళ్తారేమో! పెద్దమనవడూ, వాడి భార్యా కూడా వెళ్తున్నట్లున్నారు."

అంతా వరలక్ష్మి ఊహాగానాలే కానీ యిదీ విషయం అంటూ ఎవరూ ఆవిడతో చెప్పలేదు. అడిగేందుకు అవకాశమూ యివ్వలేదు.

"కోడలూ, మనవడూ వెళ్తారు కదా! చాలు. అన్ని పనులూ అది చూసుకుంటుంది. ఆయన్ని బండిలోకి ఎక్కించడం, దింపడం వాడు చూసుకుంటాడు. తాతయ్యంటే వాడికి చాలా ప్రేమ." నిశ్చింతగా అనుకుంది వరలక్ష్మి.

"ఇంకా రెండ్రోజులు." చిన్నగా నిట్టూరుస్తూ తనలో తనే లెక్కపెట్టుకుంది.

చూస్తూండగానే ఆ రెండ్రోజులూ కూడా గడిచిపోయాయి. రాత్రికే ప్రయాణం. మధ్యాహ్నం భోజనాలయ్యాక చెప్పులేసుకుని బయటకి వెళ్తున్న మనవడిని దగ్గరికి పిల్చింది వరలక్ష్మి.

"ఒరే ప్రశాంతూ, తాతయ్య బట్టలన్నీ ఈ సంచీలో సర్దాను. ఆయన బాధ్యతంతా నీది." ఆమె నవ్వుతూ చెప్తుంటే వాడు అయోమయంగా చూశాడు.

"తాతయ్యనెవరు తీసుకెళ్తున్నారిపుడు!" అన్నాడు.

వరలక్ష్మి బిత్తరపోయింది. "అదేమిటి!" అంది.

"తాతయ్యొస్తున్నారని నాకసలు తెలీదు." అన్నాడు.

"ఇందులో తెలిసేదేముందిరా! ఎలాగూ వాన్ యింటిదాకా వస్తుంది కదా! తాతయ్య కూడా వస్తారు." వరలక్ష్మి తేలికగా అంది.

"అదికాదు నాయనమ్మా! వచ్చేటపుడు నేను వాన్‌లో రాను. అక్కడినుంచి బొంబే వెళ్తాను. ఇంటర్వ్యూ వుంది నాకు."

ఆ మాట వినగానే వరలక్ష్మి కంగారుగా కోడలి దగ్గరికి నడిచింది.

"ఏమే పార్వతీ! వచ్చేటపుడు ప్రశాంత్ మీతో రాడా!"

"లేదత్తయ్యా! రావడం లేదు."

"అయ్యో!" అంది వరలక్ష్మి. "వాడొస్తే మామగారి సంగతి శ్రద్ధగా చూసుకుంటాడు కదా అనుకున్నాను. సరే. కానీ. ఏం చేస్తాం! రాఘవ వుంటాడుగా." తనలో తనే అనుకుంటున్నట్లుగా అంది.

గిన్నెలు కడుగుతూన్న పార్వతి ఆశ్చర్యంగా వెనక్కి తిరిగింది. "మామగారు కూడా వస్తున్నారా పెళ్ళికి!"

మరోమారు బిత్తరపోయింది వరలక్ష్మి. "అదేమిటే అలా అడుగుతున్నావు! ఈడుపుగల్లు వెళ్ళాలని మామగారు ఎన్నాళ్ళబట్టో కలవరిస్తున్నారు కదా! ప్రయాణం కష్టం అనీ, తీసుకువెళ్ళే తీరికలేదనీ వాయిదా వేశాం. ఇప్పుడు అక్కడిదాకా వాన్ వెళ్తూంటే మామగారు రాకుండా ఎలా వుంటారు!"

పార్వతి మాట్లాడలేదు. ఒక్క క్షణం మౌనం తర్వాత "మీ అబ్బాయి అనలేదు మరి." అంది.

వరలక్ష్మి గుండె వేగంగా కొట్టుకుంది. "నిజమే. అసలు రాఘవ ఏమనుకుంటున్నాడో!" ఆలోచనగా వెనక్కి వచ్చింది.

నిద్రబోతున్న వెంకట్రామయ్య మొహంలో స్పష్టంగా మెరుస్తున్న ఆనందం చూస్తే ఆమె భయం మరింత ఎక్కువయింది. "ఈసారి కూడా ప్రయాణం లేదని తెలిస్తే యింకేమయినా వుందా!"

కొడుకు కోసం ఎదురు చూస్తూ గేటు దగ్గర చతికిలబడింది వరలక్ష్మి.

ఎన్నాళ్ళ కోరిక! ఎన్నాళ్ళ కలవరింత!

మొట్టమొదట.. సంక్రాంతికి ముందు.. "ఎవరూ రానక్కరలేదు. నేనొక్కడినే వెళ్ళగలను." అంటూ బయల్దేరాడు వెంకట్రామయ్య.

అప్పుడు యింకొంచెం ఓపిక వుండేది. కానీ యింటిల్లిపాదీ భయపడ్డారు. ఎలాగోలా నచ్చచెప్పి, బ్రతిమలాడీ ప్రయాణం మాన్పించారు.

మూడ్నెళ్ళు వూరుకున్నాడు. శ్రీరామనవమి వస్తోందనగానే మళ్ళీ బయల్దేరాడు, "వూరికెళ్ళి పందిళ్ళు చూడాలి" అంటూ. భగీరథప్రయత్నంతో మళ్ళీ ఆపారు.

ఆ తర్వాత తనంతట తను వెళ్ళలేనని ఆయనకే అర్ధమయింది. "ఒక్కసారి తీసుకెళ్ళండిరా!" అనే బ్రతిమలాట మొదలయింది.

ఎనిమిదినెలలుగా.. ఏ దూరపుచుట్టం ఆవైపుగా వెళ్తున్నాడన్న వార్త విన్నా ... వాళ్ళతో తానూ వెళ్తానన్న మారాము ఎక్కువయింది.

అయినా ప్రయాణం మాత్రం కుదరలేదు. అన్నీ అయిపోయాక... యిప్పుడు ఈ అవకాశం వచ్చింది. ఇది కూడా పోతే ఇక ఆయన ఆ వూరు వెళ్ళడం పడదు. ఆ కోరిక తీరదు.

అందుకే వరలక్ష్మి భయపడుతోంది. ఆమె ఆందోళనతో సంబంధం లేకుండా కాలం గడిచింది. ఆరింటికి రాఘవ వచ్చాడు.

" ఏంటమ్మా! అంత దూరం ఎలా తీసుకువెళ్తాం, వాన్‌లో అయితే మాత్రం! " అన్నాడు.

ఏడు అవగానే కోడలు భోజనం పెట్టింది. వెంకట్రామయ్య భోజనం చేసి, సంచీ ఒకసారి సరి చూసుకుని, వాన్ కోసం ఎదురుచూస్తూ మంచం మీద నడుం వాల్చాడు.

భర్తకి ఎలా చెప్పాలో అర్థం కాని అయోమయంతో వరలక్ష్మి మంచం దగ్గర చతికిలబడింది.

"వాళ్ళు రాగానే లేపవే." అంటూ వెంకట్రామయ్య నిద్రలోకి జారాడు.

తొమ్మిదవుతూండగా వచ్చింది వాన్.

"వెళ్ళొస్తామమ్మా! ఎల్లుండి ప్రొద్దునకి వచ్చేస్తాం." రాఘవ బయటకి నడిచాడు.

నిద్రపోతూన్న భర్తని ఒకసారి పరీక్షగా చూసి వడివడిగా బయటకి వచ్చింది వరలక్ష్మి.

"మామగారు సంచీ కూడా సర్దుకున్నారండీ. బాధపడతారేమో!" అంటోంది కోడలు వాన్ దగ్గర.

"పోనీ తీసుకెళ్దాం నాన్నగారూ! వచ్చేటపుడు మీరు కాస్త కష్టపడాలి. అంతేగా!" అంటున్నాడు మనవడు.

రాఘవ ఆలోచిస్తున్నట్లుగా నిలబడ్డాడు.

వరలక్ష్మి ఆశగా గడప దగ్గర ఆగింది.

"ఏమయింది!" వాన్‌లోనుంచి చుట్టాలందరూ అడిగారు.

రాఘవ సమస్యని వివరించాడు. "అంత దూరం తీస్కెళ్ళడం కష్టమేమోనని ఆలోచిస్తున్నాను." అన్నాడు.

"నిజమే." అందరూ ముక్తకంఠంతో అతన్ని సమర్థించారు.

"అందుకే నాన్నకి చెప్పకుండా బయల్దేరాం." రాఘవ సంజాయిషీగా అన్నాడు.

"మంచిపని చేశారు." వాన్‌లోనుంచి పదిగొంతులు ఒకేసారిగా వినిపించాయి.

"పెద్దవాళ్ళు ఒక్కొక్కప్పుడు చాదస్తంగా వుంటారు. కష్టసుఖాలు మనమే ఆలోచించుకోవాలి."

ఆ మాటలు వూతంగా తీసుకుని రాఘవ వాన్ ఎక్కాడు. వెనకే అతని భార్యా.. కొడుకూ..

వాన్ కదలగానే వరలక్ష్మి లోపలికి నడిచింది. ఆమె కళ్ళనిండా నీళ్ళు నిండాయి. నిద్రబోతూన్న భర్తనే తదేకంగా చూస్తూ మంచం దగ్గర కూర్చుంది.

తెల్లవారుఝామున నాలుగు గంటలకి ఉలికిపడినట్లుగా లేచాడు ఆయన. "ఏమే వాన్ వచ్చిందా!" కలవరిస్తున్నట్లుగా వినబడిన ప్రశ్నకి, ఒక్కొక్క అక్షరమూ కూడబలుక్కుంటూ సమాధానం చెప్పింది వరలక్ష్మి. అప్పటికి ముప్పైవేలసార్లు మననం చేసుకున్న సమాధానం. .

"వచ్చింది. పిల్లలు వెళ్ళారు."

అంతే. ఆ మాటలకి వెంకట్రామయ్య స్పందన మాత్రం ఆమెకి కనబడలేదు. ఎంత కళ్ళు విప్పార్చి చూసినా, ఆ గుడ్డి వెలుతురులో ఆయన మొహంలోని భావం పట్టుబడలేదు. ఆతర్వాత ఆయన కూడా నిద్రపోలేదని మాత్రం అర్ధమయింది.

రెండురోజుల తర్వాత వెళ్ళినవాళ్ళు తిరిగొచ్చారు.

తర్వాత నాలుగురోజులకి. . వెంకట్రామయ్య నిద్రలోనే మరణించాడు.

చివరి వారం రోజులూ ఎవరితోనూ ఒక్కమాట కూడా మాట్లాడలేదు.

*****

శవదహనం అయింది.

"కర్మకాండలు ఈడుపుగల్లులో జరిపిస్తే బాగుంటుందని నా అభిప్రాయం." ఒక కూతురు తీర్మానం ప్రవేశపెట్టింది.

"ఈడుపుగల్లులోనా. . !"

"అవును. ఈడుపుగల్లు అంటే నాన్నకి చాలా యిష్టం." రెండో కొడుకు వత్తాసు పలికాడు.

"కరెక్టే కానీ పరాయి వూరంటే చాలా ఖర్చవుతుంది. ఇబ్బందులు కూడా చాలా వుంటాయ్" అన్నాడు వెంకట్రామయ్య తమ్ముడు.

"ఖర్చు గురించి ఆలోచిస్తే ఎలా! మామగారి మనసుకు యిష్టమయిన చోట జరిపిస్తే, ఆయన ఆత్మకి శాంతి." రెండో కోడలు మాటలవి.

ఒక్కొక్క వాక్యమూ చెవిన పడుతుంటే వరలక్ష్మికి మతిపోతోంది. "ఆయన బ్రతికుండగా ఏమయ్యారు వీళ్ళందరూ!"

"ఇంక దేనిమీదా అంత భ్రాంతి లేదు ఆయనకి. అన్ని విషయాల్లో ఎంతో గంభీరంగా వుండే మామగారు, ఒక్క ఈ వూరు విషయంలో మాత్రం చిన్నపిల్లాడయిపోయేవారు."

"అవును మరి. నాన్న చిన్నప్పుడు చదువుకుంది ఆ వూర్లోనే. .. సంపాదన ఆ వూర్లోనే. మేమందరమూ పుట్టింది అక్కడే. మా పెళ్ళిళ్ళు.. మళ్ళీ మనవళ్ళు పుట్టడం.. ఎన్ని జ్ఞాపకాలు వున్నాయనుకున్నావు ఆయనకి ఆ వూరితో!"

కూతురి మాటలు వింటుంటే వరలక్ష్మి కళ్ళనుంచి జలజలా నీళ్లు రాలాయి.

వీళ్ళు.. వీళ్ళంతా వున్నారు ఆరోజు వాన్‌లో. కానీ ఒక్కళ్ళు.. కనీసం ఒక్కళ్ళు కూడా "కొంచెం కష్టమయితే అయింది, ఆయన్ని మేం ఈడుపుగల్లు తీస్కెళ్ళి చూపించి వస్తాం." అనలేదు. ముసలివాడికి కోరికలేమిటన్నారు! నిర్దాక్షిణ్యంగా వదిలేసి వెళ్ళిపోయారు. ఇపుడు ఎంత గొప్పగా ఆయన మనసు గురించీ, కోరికల గురించీ ఉపన్యసిస్తున్నారు! ఇంతమంది కూతుర్లూ.. కొడుకులూ.. కోడళ్ళూ.. ఎవరికీ అర్థం కాలేదా ఆరోజు ఆయన పడ్డ బాధ! "ఆయన కోరికని ఆయన బ్రతికి వుండగా తీర్చడం ముఖ్యం" అని ఏ ఒక్కరికీ అనిపించలేదా!

"..లేదు. నేనసలు ముందే నిర్ణయించుకున్నాను. కర్మకాండలు ఈడుపుగల్లులో జరిపించాలన్న ఆలోచన నాకెప్పుడో వచ్చింది." రాఘవ మాటలు ఆమె ఆలోచనలని తెగ్గొట్టాయి.

కన్నీళ్ళలోనుంచి మసక మసకగా కనబడుతున్న వాళ్లందరి మొహాలూ ఆనందంతో మెరుస్తున్నాయి. తండ్రిని అర్థం చేసుకుని ఆయన చివరికోరికని తీరుస్తున్నామన్న ఆలోచనతో, ఆయన ఆత్మకి శాంతి కలిగిస్తున్నామన్న భావంతో వాళ్ళ హృదయాలు ఉప్పొంగుతున్నాయి.

నిజంగా తీరుతుందా ఆయన కోరిక! శాంతిస్తుందా ఆయన ఆత్మ!

ఏమో ఎవరికీ తెలీదు. కానీ ఆప్రశ్న మనసుని తాకిన ప్రతిసారీ వరలక్ష్మి హృదయం మాత్రం దుఃఖంతో బరువెక్కుతుంది.

*****

కథా నిలయం 4717 శ్రీకాకుళం